హామీలు నీటి మూటేనా?

అధికారంలోకి రావడానికి కూటమి నేతలు ఎన్నికల వేళ అలవికాని హామీలిచ్చారు. అధికారంలోకి వచ్చి వందరోజులు దాటినా హామీల అమలు మరిచారు. ఇంటింటికీ వెళ్లి 'ఇది మంచి ప్రభుత్వం' అని ఊదరకొడుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంపై ఎమ్మెల్యే బండారు శ్రావణి దృష్టి సారించకపోవడంపై అన్ని వర్గాల ప్రజలు మండిపడుతున్నారు.



- సాగు, తాగునీటికి ప్రాధాన్యత ఇస్తామన్న బండారు శ్రావణి
- సాగునీరు విడుదల చేయకపోవడంతో రైతుల తిరుగుబాటు


శింగనమల : టీడీపీ వంద రోజుల పాలన ప్రజలను నిరాశ పరిచింది. శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి హామీలు గాలికి వదిలి సొంత ఆదాయానికి ప్రాధాన్యత ఇస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్నికల ప్రచారంలో నియోజకవర్గంలోని బుక్కరాయసముద్రంలో చంద్రబాబునాయుడు, గార్లదిన్నె మండలం కల్లూరులో బాలకృష్ణ పర్యటించారు. నియోజకవర్గంలోని సమస్యలను బండారు శ్రావణి వారి దృష్టికి తీసుకెళ్లడంతో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించిన బండారు శ్రావణి పలు హామీలు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు దాటినా హామీలు కార్యరూపం దాల్చడం లేదని, సొంత ఆదాయానికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారని సొంత పార్టీ నేతల నుంచే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే నియోజకవర్గంలోని సమస్యలను సైతం ఎమ్మెల్యే పట్టించుకోకపోవడంతో ప్రజల నుంచి నిరసన వ్యక్తమవుతోంది. ప్రధానంగా నియోజకవర్గంలోని రైతులకు ప్రాధ్యాన్యత ఇచ్చి సాగునీరు విడుదల చేస్తానని ఆమె హామీ ఇచ్చి, విస్మరించారు. దీంతో హెచ్చెల్సీ ఆయకట్టుకు నీరు విడుదల చేయాలని బుక్కరాయసముద్రం మండలం సంజీవపురం, కేకే అగ్రహారం రైతులు ఇటీవల బుక్కరాయసముద్రం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేయడం ఎమ్మెల్యేపై ఎంత వ్యతిరేకత ఉందో తెలుస్తోంది.


చాగల్లు రిజర్వాయర్ ముంపు గ్రామం ఉల్లికల్లు (ఫైల్)


సాగునీటి కోసం ఇటీవల బుక్కరాయసముద్రం వద్ద రాస్తారోకో చేస్తున్న రైతులు (ఫైల్)

ప్రచారంలో బండారు శ్రావణి హామీలు ఇలా..

- శింగనమల మండలంలోని ఉల్లికల్లు, ఉల్లికంటి పల్లి గ్రామాలకు చాగల్లు ముంపు పరిహారం, ప్యాకేజీ అందిస్తామన్నారు. ఆ హామీ నెరవేర వేర్చడానికి కృషి చేయకుండా అక్కడ ఉన్న ఇసుకను అక్రమంగా తవ్వడానికి టీడీపీ కార్యకర్తలు ఇటాచీని తీసుకవచ్చి ప్రయత్నం చేయడంతో గ్రామస్తులు అడ్డుకున్నారు.
- శింగనమల మండలంలోని రాచేపల్లి వద్ద నున్న లెదర్ పార్కును పునః ప్రారంభిస్తామని హామీ ఇవ్వగా, కేవలం పరిశీలనతోనే సరిపెట్టారు.
- ఎంపీఆర్ డ్యాం దక్షిణ కాలువ కింద ఉన్న ఐదో డిస్ట్రిబ్యూటరీ కింద శింగనమల మండలంలోని హెచ్చెల్సీ చివరి ఆయకట్టు రాచేపల్లి వరకూ, అలాగే సలకంచెరువుకు నీరు విడుదల చేస్తామన్నారు. కానీ ఇంకా హెచ్చెల్సీకి సైతం నీరు విడుదల చేయడం లేదు.
- శింగనమల మండలంలోని ఈస్ట్ నరసాపురంలో పూలే గురుకుల బీసీ బాలికల పాఠశాలకు నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తామన్నారు.
- శింగనమలలో అంబేడ్కర్ కమ్యూనిటీ భవనం నిర్మిస్తామన్నారు.
- గార్లదిన్నె మండలంలోని కల్లూరులో ముస్లింలకు షాదీఖానా నిర్మాణం పూర్తి చేసి ప్రారంభిస్తామన్నారు.
- గార్లదిన్నె మండలం కల్లూరులో అసంపూర్తిగా నిలిచి పోయిన ఇండోర్ స్టేడియం పనులు పూర్తి చేసి, క్రీడాకారుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.
- గార్లదిన్నె మండలం కల్లూరులో అండర్ పాస్ రైల్వే బ్రిడ్జి సమస్యకు శాశ్వత పరిష్కరం చేస్తామన్నారు.
- గార్లదిన్నె మండలం కల్లూరులో ముస్లిం శ్మశాన వాటికి దారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు.
- గార్లదిన్నె మండలం ఎర్రగుంట్ల వద్ద బైపాస్ కెనాల్ పూర్తి చేసి రైతులకు ఆయకట్టు నీరు అందిస్తామన్నారు.
- మిడ్ పెన్నార్ డ్యాం గేట్ల మరమ్మతులు, దక్షిణ, ఉత్తర కాలువల ఆధునీకరణ పనులు, చెరువులకు హెచ్చెల్సీ నీరు అందిస్తామన్నారు.
- బుక్కరాయసముద్రం మండలంలోని జంతులూరు వద్ద మార్కెట్ యార్డ్‌కు సొంత భవనం నిర్మాణానికి కృషి చేస్తామన్నారు.
- నార్పల మండలంలోని గూగూడును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామన్నారు.


గూగూడు కుళ్లాయి స్వామి దేవాలయం


ఎంపీఆర్ డ్యాం

నియోజకవర్గ సమాచారం



మండలాలు : శింగనమల, గార్లదిన్నె, నార్పల, పుట్లూరు, యల్లనూరు, బుక్కరాయసముద్రం,
మొత్తం జనాభా: 3,34,645
మొత్తం ఓటర్లు: 2,47,373

హామీలు నెరవేర్చాలి



ఎన్నికల ముందు చంద్రబాబు అమలు చేయలేని హామీలిచ్చి ప్రజలను మోసం చేశారు. వారి బాటలోనే టీడీపీ ఎమ్మెల్యేలు మోసం చేస్తున్నారు. వంద రోజుల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదు. ప్రజలు ఎంతో నమ్మకంతో ఓట్లు వేస్తే, వారి సమస్యలను పక్క పెట్టారు. నియోజకవర్గంలో హెచ్చెల్సీ కింద సాగు నీరు కోసం రైతులు ఎంతో ఇబ్బంది పడుతున్నారు. వంద రోజుల పాలనలోనే రైతులు రోడ్డెక్కె పరిస్థితి వచ్చింది. ఈ ఎమ్మెల్యేకు ఎందుకు ఓట్లు వేశామని రైతులంటున్నారు. ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చడంలో టీడీపీ ప్రభుత్వం విఫలమైంది.

– ఎం.వీరాంజనేయులు, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, శింగనమల

చెరువులకు హెచ్చెల్సీ నీరు విడుదల చేయాలి



ఎంపీఆర్‌డ్యాం, పీఏబీఆర్ కింద ఉన్న చెరువులకు నీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలి. ఎంపీఆర్ డ్యాంకు ఉన్న లీకేజీలు, గేట్లు మరమ్మత్తులు చేసి, నీటి నిల్వ చేస్తే చుట్టు ప్రక్కల గ్రామాల్లోని బోర్లలో భూగర్భజలం పెరిగే అవకాశం ఉంటుంది. వీటికి నిధులు మంజూరు చేయించడానికీ ఎమ్మెల్యే కృషి చేయాలి. లేకుంటే రైతులంతా కలసి ఆందోళన చేస్తాం

– సుబ్బారెడ్డి, రైతు, ముకుందాపురం, గార్లదిన్నె మండలం

క్లుప్తంగా

సీనియర్ అగ్రికల్చర్ ఇంజనీర్ బాధ్యతల స్వీకరణ


సీనియర్ అగ్రికల్చర్ ఇంజనీర్‌గా బాధ్యతలు స్వీకరించిన విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న సంస్థ డైరెక్టర్ బాలాజీ మురారి నాందెడే

గార్లదిన్నె: మండలంలోని దక్షిణ క్షేత్ర వ్యవసాయ యంత్రాల శిక్షణ పరిరక్షణ సంస్థ (ట్రాక్టర్ నగర్)లో శనివారం నూతన సీనియర్ అగ్రికల్చర్ ఇంజనీర్‌గా విజయ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు .ఈ సందర్భంగా ట్రాక్టర్ నగర్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ బాలాజీ మురారి నాందెడే సన్మానించారు. అలాగే ట్రాక్టర్ నగర్‌లో సీనియర్ అగ్రికల్చర్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న కమలాబాయి అస్సాం రాష్ట్రంలో ట్రాక్టర్ నగర్ సంస్థ డైరెక్టర్‌గా పదోన్నతి పొందారు. అనంతరం వారు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సిబ్బందితో కలసి ట్రాక్టర్ నగర్‌లో మొక్కలు నాటారు.

బాల్యవివాహాలు నేరం


మాట్లాడుతున్న జేఎఫ్‌సీఎం మంజుల

గుంతకల్లు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని గుంతకల్లు జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ మంజుల హెచ్చరించారు. స్థానిక ఆచారమ్మ కొట్టాలలోని పాండురంగస్వామి ఫంక్షన్ హాల్‌లో శనివారం బాల్య వివాహాల నిరోధక చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బాల్యవివాహాలను పోత్రాహించడం వల్ల ఎలాంటి శిక్షలు అమలు అవుతాయో వివరించారు. మహిళలకు ఎటువంటి సమస్యలు తలెత్తినా న్యాయస్థానం ఆశ్రయించాలన్నారు. అనంతరం వన్‌టౌన్ సీఐ మనోహర్, ప్రభుత్వాస్పత్రి వైద్యురాలు స్వాతి, లాయర్ వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కృష్ణవేణి, మాజీ కౌన్సిలర్ రామాంజనేయులు తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చాముండి, చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి

బుక్కరాయసముద్రం: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యమని ఎమ్మెల్యే బండారు శ్రావణి అన్నారు. శనివారం మండలంలోని సంజీవపురంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బండారు శ్రావణి హాజరై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 100 రోజుల పరిపాలనలో పేదల కోసం అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేశామన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ సునీత, స్పెషలాఫీసర్ శ్రీదేవి, తహసీల్దార్ పుణ్యవతి, సీడీపీఓ ఉమా శంకరమ్మ, ఏపీఎం మద్దిలేటి, ఈఓఆర్డీ దామోదరమ్మ పసుపుల హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

పామిడి: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. శనివారం స్థానిక ఎద్దులపల్లిరోడ్డులోని సచివాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వందరోజుల్లోనే సీఎం నారా చంద్రబాబు ఆధ్వర్యంలో పెంచిన పింఛన్లను సక్రమంగా అందజేశామన్నారు. ఉపాధి పథకం కింద రూ.5 కోట్లతో రోడ్లు, డ్రైనేజీల ఏర్పాటు వంటి అభివృద్ధి పనులతో మండలాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్ శ్రీధర్‌బాబు, ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్, ఈఓఆర్డీ శశికళ, ఈఓ చంద్రశేఖర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మూర్ఛ వైద్య శిబిరం

తాడిపత్రి అర్బన్: స్థానిక హనుమాన్ జంక్షన్‌లోని రోటరీ క్లబ్ కార్యాలయంలో శనివారం మూర్ఛ వైద్య శిబిరం నిర్వహించారు. విజయవాడకు చెందిన ప్రముఖ వైద్యుడు గోపాలం శివన్నారాయణ ఆధ్వర్యంలోని వైద్య బృందం దాదాపు 50 మంది మూర్ఛ వ్యాధిగ్రస్థులకు చికిత్స చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు పి.వి.సుబ్రమణ్యం, సభ్యులు బాలసుబ్రమణ్యం, రమేష్‌బాబు, ఓబులేసు, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసౌకర్యాల నడుమ స్కూల్ గేమ్స్


తాడిపత్రిలో విరిగిన పైప్‌లపై కూర్చొని భోజనం చేస్తున్న క్రీడాకారులు


తాడిపత్రిలో ఎండలోనే యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

తాడిపత్రిటౌన్: పట్టణంలో మండల స్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ పోటీలు విద్యాశాఖ అధికారుల నిర్లక్షం కారణంగా అసౌకర్యాల నడుమ శనివారం ముగిశాయి. కనీస వసతులు కల్పించక పోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పోటీల్లో మండలంలోని 13 పాఠశాలలకు చెందిన దాదాపు 700 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పట్టణంలోని హైస్కూల్‌లో యోగా పోటీలు ఎండలో నిర్వహించడంతో విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. పట్టణంలోని అరవిందాశ్రమం స్కూల్ సమీపంలోని వాటర్ ట్యాంక్ వద్ద క్రీడాకారులకు అసౌకర్యాల నడుమ భోజనాలు ఏర్పాటు చేశారు. అలాగే పలువురు విద్యార్థులకు రవాణా సౌకర్యం లేక బస్సుల కోసం రోడ్లపై వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది.

కబడ్డీ పోటీల్లో రాయలచెరువు విన్నర్

యాడికి: మండలంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్కూల్ గేమ్స్‌లో బాలికల కబడ్డీ అండర్ -14, విభాగంలో 8 జట్లు, అండర్-17 విభాగంలో 8 జట్లు పాల్గొనగా రాయలచెరువు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచారని ఎంఈఓ కాశెప్ప తెలిపారు. అలాగే అండర్-17 బాలికల విభాగంలో చెస్ పోటీల్లో 4 జట్లు పాల్గొనగా రాయలచెరువు ఉన్నత పాఠశాల విద్యార్థిని లక్ష్మి సౌజన్య మండల టాపర్‌గా నిలిచిందన్నారు. కార్యక్రమంలో పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పామిడి: పట్టణంలోని టీసీహైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం వివిధ క్రీడాపోటీలను అట్టహాసంగా ప్రారంభించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారు ఈనెల 25, 27 తేదీల్లో గుంతకల్లులో నిర్వహించే నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో హెచ్ఎం రామ్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్కా బీటర్ అరెస్టు

తాడిపత్రి అర్బన్: మట్కా రాస్తున్న ఓ బీటర్‌ను అరెస్టు చేసి, అతడి నుంచి రూ.8 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్ సీఐ సాయిప్రసాద్ తెలిపారు. శనివారం పట్టణంలోని కాల్వగడ్డ వీధిలో మట్కా నిర్వహిస్తున్నారన్న సమాచారం అందుకున్న సీఐ తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. దాడుల్లో తాడిపత్రి మండలం కోమలి గ్రామానికి చెందిన రామచంద్రను అదుపులోకి తీసుకుని, నగదుతో పాటు మట్కా చీటీలను స్వాధీనం చేసుకున్నారు.

ఘనంగా శాంతి దినోత్సవం

పామిడి: పట్టణంలోని పంచాయతీ కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ శాంతి దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాపారాయణుడు, కవి కే నారాయణమూర్తిని ఈఓ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది ఖాజామోహిద్దీన్ ఛిస్తీ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దోమతెరల పంపిణీ

తాడిపత్రిటౌన్: పట్టణంలోని భగత్‌సింగ్ నగర్‌లో ఉన్న ఎస్సీ బాలికల హాస్టల్‌లో విద్యార్థులకు ఉద్యోగ ఉపాధ్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం దోమ తెరలు పంపిణీ చేశారు. 103 మంది విద్యార్థులకు రూ.8వేలు విలువ గల దోమ తెరలు అందజేసినట్లు సంస్థ అధ్యక్షుడు గురప్ప తెలిపారు. వార్డెన్ రాధ, కన్వీనర్ నారబోయిన శంకర్, మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి, సంయుక్త కార్యదర్శి కరుణాకర్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, కుమారస్వామి, రామేశ్వరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా పౌష్టికాహార మాసోత్సవాలు

పామిడి/గుంతకల్లు రూరల్: పామిడి పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రం-15లో పౌష్టికాహార మాసోత్సవాల కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. గుత్తి ఐసీడీఎస్ ఏసీడీపీఓ నాగమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే గుంతకల్లు మండలంలోని గొల్లలదొడ్డి గ్రామంలో శనివారం ఐసీడీఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షాహీదా, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే నక్కనదొడ్డిలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పావతి ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు.

స్వచ్ఛత దిశగా అడుగులేద్దాం


ర్యాలీలో పాల్గొన్న చైర్‌పర్సన్ భవాని, కమిషనర్ రమణయ్య

గుంతకల్లుటౌన్: ప్రతి ఒక్కరూ స్వచ్ఛత దిశగా అడుగులేసి స్వచ్ఛ గుంతకల్లుగా తీర్చిదిద్దుకుందామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ భారత్ ఆవశ్యకతను చాటుతూ శనివారం పట్టణంలోని మెప్మా ఆధ్వర్యంలో మహిళలు ర్యాలీ నిర్వహించారు. చైర్‌పర్సన్ భవాని, కమిషనర్ వెంకటరమణయ్య మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో మెప్మా టీపీఆర్ఓ మోహన్, సీఎంఎం భవానీ, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు చంద్రశేఖర్, వేణుగోపాల్ రెడ్డి, సీఓలు, ఆర్‌పీలు పాల్గొన్నారు.

వైభవంగా ఆరాధనోత్సవం


ఏకాంగేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

పెద్దపప్పూరు: మండలంలోని చింతరపల్లిలో శనివారం హిందూ ముస్లింలు ఇష్టదైవంగా బావించే అవదూత ఏకాంగేశ్వరస్వామి ఆరాధనోత్సవం మఠాధిపతులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి ఉత్సవమూర్తిని గ్రామంలో ఊరేగించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం చివరి రోజు పలు గ్రామాలన భక్తులు వనమాలి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆశ్రమ పర్యవేక్షకుడు సత్యనారాయణస్వామి తెలిపారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన


సునీతను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో కళాశాల అనుబంధంగా ఎన్‌సీఎస్‌టీసీ ప్రతినిధులు క్యాటలైజ్డ్ అండ్ సపోర్టెడ్ బై ది నేషనల్ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మూడు రోజులుగా సైబర్ సెక్యూరిటీ అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సు శనివారం ముగిసింది. ఈ సందర్భంగా రోటరీపురం జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సునీత మాట్లాడుతూ ప్రపంచంలో టెక్నాలజీ వేగంగా పెరిగిపోతోందన్నారు. డిజిటల్ లావాదేవీలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం సునీతను కళాశాల యాజమాన్యం అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ వెంకటనాగజయుడు, రీసోర్స్ పర్సన్ డాక్టర్ శశికళ, డాక్టర్ హేమంత్‌కుమార్ యాదవ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి


సుబ్బరాయుడు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న అనంత వెంకటరామిరెడ్డి, తలారి రంగయ్య, ఆలూరు సాంబశివారెడ్డి తదితరులు



గార్లదిన్నె: మండలంలోని తలగాచిపల్లిలో వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త సుబ్బరా యుడు అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎంపీ తలారి రంగయ్య, జిల్లా నాయకుడు ఆలూరు సాంబశివారెడ్డి, అనంతపురం మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి తదితరులుసుబ్బరాయుడు భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి, వైస్ ఎంపీపీ కుంచం రామ్మోహన్ రెడ్డి, జంబులదిన్నె సొసైటీ మాజీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన ముస్లిం, మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు

గార్లదిన్నె: మండల కేంద్రంలోని ముస్లిం, మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు యోగా పోటీల్లో జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఆంజనేయులు నాయక్ తెలిపారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ శనివారం అనంతపురంలోని జూనియర్ కాలేజ్‌లో నిర్వహించిన యోగా పోటీల్లో విద్యార్థులు మౌలాలీ, మిస్బాఉద్దీన్ అనే విద్యార్థులు ప్రతిభ కనబరిచారన్నారు. జిల్లా పోటీలకు ఎంపికైన వారిని ప్రిన్సిపాల్‌తోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.